సాక్షి
రంగారెడ్డి
గురువారం । 14 । నవంబర్ । 2024



జాతరకు వేళాయె

భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మైసిగండి వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి 8లో▸



విరాళాల లెక్క తెలపండి

ఉత్సవాల సందర్భంగా వచ్చి న విరాళాల్లో అవకతవకలు జరిగాయని ఆరుట్లకు చెందిన పలువురు నాయకులు ఆరోపించారు. 8లో▸



పోరాటాలతోనే పరిష్కారం

పోరాటాల ద్వారానే దళితుల సమస్య లు పరిష్కారం అవుతాయని డీహెచ్‌పీఎస్ నేత అనిల్‌కుమార్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

జన ఔషధి కేంద్రాలు ఎంతో ప్రయోజనకరం

డీఆర్‌ఎం లోకేష్ విష్ణోయ్



జన ఔషధి కేంద్రం ప్రారంభోత్సవంలో డీఆర్‌ఎం తదితరులు

కాచిగూడ: భారతీయ జన ఔషధి కేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) లోకేష్ విష్ణోయ్ అన్నారు. ప్రజలకు అతి తక్కువ ధరలకు ఔషధాలు అందించడమే లక్ష్యంగా ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాన్ని బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ బిహార్‌లోని దర్భంగా నుంచి వర్చువల్ ద్వారా జన ఔషధి కేంద్రాన్ని కాచిగూడలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ.. అతి తక్కువ ధరలతో ఔషధాలను ప్రజలు కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ కేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. రైలు ప్రయాణికులతో పాటు స్థానిక ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత, జన ఔషధి కేంద్రం ప్రతినిధి గోపు రమణారెడ్డి, రైల్వే అధికారులు రెహ్మన్, ఏకే సింగ్, డాక్టర్ శారద, ఖాన్, రైల్వే సీపీఆర్‌ఓ ఎ.శ్రీధర్, కాచిగూడ రైల్వే స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ

ముగ్గురిని కోర్టులో హాజరుపర్చిన పోలీసులు

సిటీ, కోర్టులు: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ బుధవారం నాంపల్లి కోర్టులో జరిగింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావును పోలీసులు ఎస్కార్ట్ సహాయంతో కోర్టులో హాజరుపర్చారు. మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై బయటికి వచ్చిన భుజంగరావు కోర్టుకు హాజరుకాకపోవడంతో ఆయన తరఫు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణ చేపట్టిన 14వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు వైద్య పరీక్షల కోసం మధ్యంతర బెయిల్‌పై బయటికి వచ్చిన భుజంగరావు బెయిల్‌ను రద్దు చేస్తున్నట్లు పేర్కొంది. నేటి (గురువారం) సాయంత్రం 4 గంటలలోపు కోర్టు ముందు లొంగిపోవాలని ఆదేశించింది. అనంతరం జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ముగ్గురు ప్రణీత్‌రావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావు రిమాండ్‌ను ఈ నెల 27కు పొడిగించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేస్తున్నట్లు కోర్టు తెలిపింది.

కేబీఆర్ పార్కులో జూనియర్ సివిల్ జడ్జీలు



బంజారాహిల్స్: సికింద్రాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ శిక్షణ పొందుతున్న 36 మంది జూనియర్ సివిల్ జడ్జీలు బుధవారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కు అధికారులు అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను వారికి వివరించారు. కేబీఆర్ పార్కు ఫారెస్ట్‌లో ఎన్ని రకాల మొక్కలున్నాయి? ఎన్ని రకాల పక్షులున్నాయి? అనే వివరాలను జడ్జీలకు చెప్పారు. పార్కు లోపల ఉన్న నిజాం ప్యాలెస్‌ను వారికి చూపించారు. పార్కు లోపల ఉన్న మొక్కలను గుర్తించేలా ఏర్పాటు చేసిన విధానాలను వివరించారు. రాష్ట్రంలో తొలిసారిగా రాక్ ప్లాంటేషన్‌ను ఏ విధంగా ఏర్పాటు చేశారు? అది ఏ విధంగా విజయవంతమైంది? అనే వివరాలను జూనియర్ జడ్జిలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేబీఆర్ పార్కు రేంజ్ అధికారి లక్ష్మీపతిరావు, మంజుల పాల్గొన్నారు.

దిశ కమిటీ సభ్యురాలిగా లలిత నియామకం

తాండూరు టౌన్: దిశ (జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ) కమిటీ సభ్యురాలిగా తాండూరు మున్సిపల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ అంతారం లలిత నియమితులయ్యారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి మంజూరవుతున్న నిధులు ప్రజా సంక్షేమానికి, అభివృద్ధికి ఏ మేరకు వినియోగిస్తున్నారు అనే విషయమై ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తనను దిశ కమిటీ సభ్యురాలిగా నియమించిన ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీగ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రిజర్వేషన్ ప్లీజ్

విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ)కులంలో కమ్మరి, కంచరి, వడ్రంగి, శిల్పి, స్వర్ణకార వంటి వృత్తులు ఉన్నాయి. కేవలం పంచ శిల్పులే కాకుండా ఇతర కులాల వారు కూడా ఈ వృత్తుల్లో స్థిరపడిపోయారు. చేతి వృత్తుల జాబితాలోకి రెడీమేడ్ కార్పొరేట్ సంస్థలు వచ్చి చేరాయి. ఉపాధి కోల్పోయి ఆర్థికంగా చితికిపోవడంతో పాటు రాజకీయంగా కనీస గుర్తింపు లేకుండా పోయింది. ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో ఈ చేతి వృత్తుల జాబితా లేదు. ఈ ఉపకులాలన్నింటినీ విశ్వబ్రాహ్మణ కులం జాబితాలో చేర్చి.. మాకు స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి.

– బ్రహ్మచారి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

వడ్డెరలు పూర్తిగా సంచార జీవులు. ఒక చోటి నుంచి మరో చోటికి వలస పోతుంటారు. ఇటుక బట్టీలు, మైన్స్, నిర్మాణాలపై ఆధారపడి జీవిస్తుంటారు. ఎస్టీ జాబితాలో ఉన్న వీరిని 1976లో అప్పటి ప్రభుత్వం.. బీసీ ఏలో చేర్చింది. దీంతో రాజకీయ అవకాశాలు సన్నగిల్లాయి. ప్రస్తుతం ప్రభుత్వం కుటుంబ సర్వే చేస్తోంది. మెజార్టీ వడ్డెరలు స్వగ్రామాల్లో లేరు. వీరి వివరాలను సేకరించక పోవడం వల్ల వడ్డెర కులానికి అన్యాయం జరుగుతోంది. నివాసంతో సంబంధం లేకుండా వారి వివరాలు సేకరించాలి. స్థానిక సంస్థల్లో వడ్డెరలకు తగిన ప్రాధాన్యత కల్పించాలి.

– మారెయ, వడ్డెర సంఘం జిల్లా ప్రతినిధి

పూసల కులంలో పుట్టిన వారికి కనీస గుర్తింపు లేదు. ఆర్థికంగా, రాజకీయంగా ఏమాత్రం అవకాశాలు లేకపోవడంతో ప్రస్తుతం వీరు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. పూసలను సంచార జాబితాలో చేర్చి.. జెడ్పీటీసీలుగా, ఎంపీటీసీలుగా, కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా, సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా అవకాశం కల్పించాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ జాతికి ఐదు నుంచి పదిశాతం రిజర్వేషన్లు కల్పించాలి.

– సదానందం, పూసల సంఘం నాయకుడు

ప్రతీ మనిషితో మాకు అవినాభావ సంబంధం ఉంది. మనిషి తను పుట్టినప్పుడు మేము తయారు చేసిన చాటలో వేస్తారు. చనిపోయినప్పుడు మేము పేర్చే పాడెపై మోస్తారు. గంపలు, తట్టలు, బుట్టలు అల్లి జీవిస్తుంటాం. మా జనాభా కూడా చాలా తక్కువ. మాది అత్యంత వెనుకబడిన కులం. ప్లాస్టిక్ వస్తువులు వచ్చి తమ జీవనాధారాన్ని దెబ్బతీశాయి. రాజకీయ అవకాశాలు దక్కడం లేదు. స్థానిక సంస్థల్లో మాకు ప్రాధాన్యత కల్పించాలి.

– ఉమా, గంగాధర్, హన్మంతు, మేదరి సంఘం ప్రతినిధులు



డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ కమిటీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న కుల సంఘాల నాయకులు

రాజకీయాల్లో మాకూ అవకాశం కల్పించండి

- డెడికేటెడ్ కమిషన్‌కు కుల సంఘాల వినతి
- స్థానిక సంస్థల్లో పొలిటికల్ రిజర్వేషన్లపై బహిరంగ విచారణ
- అభ్యర్థనలు, ఫిర్యాదులను నమోదు చేసుకున్న కమిషన్ సభ్యులు
- 30 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్న చైర్మన్ బూసాని



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: స్థానిక సంస్థల్లో తమకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని పలు బీసీ కులాల ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను ఒకటి రెండు పెద్ద కులాల(జనాభా ఎక్కువగా ఉండే ముదిరాజ్, యాదవ, గౌడ)వాళ్లే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల్లో రాజకీయ రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వం నియమించిన తెలంగాణ వెనుకబడిన తరగతుల డెడికేటెడ్ కమిషన్ బుధవారం రంగారెడ్డి జిల్లాలో పర్యటించింది. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బీసీ కులసంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల నుంచి అభిప్రాయాలను సేకరించింది. బహిరంగ విచారణలో భాగంగా కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌రావు, ఐఎఫ్‌ఎస్ కార్యదర్శి బి.సైదులు, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌లు పాల్గొని, సభ్యుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఒక్కో కుల సంఘం ప్రతినిధితో ప్రత్యేకంగా చర్చించింది. ప్రభుత్వం బీసీలకు కల్పించిన రిజర్వేషన్లను ఒకటి రెండు బలమైన కులాల వారే అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడ్డెర, మంగలి, కమ్మరి, కుమ్మరి, కంసాలి, రజక, వీరముష్టి, సగర, మేదరి, మత్స్య, గంగిరెద్దుల, బాలసంతుల, మొండి, పెద్దమ్మల వంటి వెనుకబడిన సంచార జాతులకు రాజకీయంగా కనీస ప్రాధాన్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా నివాసాలు లేని కొన్ని సంచార జాతులకు కనీసం బీసీ సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. బీసీలను కూడా ఏబీసీడీలుగా వర్గీకరించి, అణగారిన జాతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. అన్ని కులాలు, జాతుల ఆవేదనను అర్థం చేసుకున్నానని, కుల సంఘం ప్రతినిధులు చెప్పిన ప్రతీ అంశాన్ని నోట్ చేసుకున్నామని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వానికి ముప్పై రోజుల్లో సమగ్ర నివేదిక ఇస్తామని తెలిపారు. బహిరంగ విచారణలో భాగంగా బీసీ ఫెడరేషన్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, విశ్వకర్మ సంఘం ప్రతినిధులు సెల్వాచారి, ఆదిమూలం వెంకటాచారి, సీపీఐఎం నాయకుడు పగడాల యాదయ్య, వడ్డెర సంఘం ప్రతినిధి రవి, ఉప్పర సంఘం ప్రతినిధి సతీష్ సాగర్, మత్స్యకారుల సంఘం ప్రతినిధి గౌరెంకల నర్సింహ్మా, మేదర సంఘం ప్రతినిధి అందూరి శివ, యంబిసి ఫౌండర్ నాగేంద్ర, తెలంగాణ రజక సంఘం ప్రతినిధి రాజ్‌కు మార్‌లు పాల్గొని, కమిషన్‌కు సలహాలు, సూచనలు అందజేశారు.

కొనుగోళ్లలో స్పీడ్ పెంచండి



అధికారులతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ధాన్యం సేకరణలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి
- జిల్లావ్యాప్తంగా 15 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి
- సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై బుధవారం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 15 పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 1,186 మంది రైతుల ద్వారా 7,951 మెట్రిక్ టన్నుల కాటన్ కొనుగోలు చేశామని తెలిపారు. మొత్తం 42 మంది రైతుల ఖాతాల్లో రూ.57.73 లక్షలు జమ చేశామని తెలిపారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం నాణ్యతను పరిశీలించాలని ఏఈఓలను ఆదేశించారు. గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెంటవెంటనే కొనుగోళ్లు జరపాలని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశిత రైస్ మిల్లులకు తరలించాలని, ట్యాబ్ ఎంట్రీలు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని రకాల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతీ ఎన్యూమరేటర్ తమ పరిధిలోని ఏ ఒక్క ఇంటిని విడిచి పెట్టకుండా సర్వే పూర్తి చేయాలని తెలిపారు. సర్వే సమయంలో ఎలాంటి తప్పిదాలకు తావివ్వకూడదని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, సీపీఓ సౌమ్య, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సివిల్ సప్లయ్ అధికారులు శ్రీనివాస్, గోపీకృష్ణ, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి రియాజుద్దీన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం గారూ.. బేషజాలకు వెళ్లకండి

అనంతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి బేషజాలకు పోరాదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి అన్నారు. నగరంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వికారాబాద్‌లోని పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న వారు పార్టీ నాయకులతో కలిసి అక్కడికి చేరుకొని నరేందర్‌రెడ్డితో మాట్లాడారు.

మా హయాంలో రైతులను ఒప్పించాం: మాజీ ఎమ్మెల్యే ఆనంద్

బీఆర్‌ఎస్ హయాంలో రైతులను మెప్పించి, ఒప్పించి భూములు తీసుకున్నామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సీఎం నేరుగా రైతులతో మాట్లాడి వారి బాధలు తెలుసుకునే ప్రయత్నం చేసి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. తాము అందుబాటులో లేకుంటే కార్యకర్తలు ఫోన్‌లో మాట్లాడుతుంటారని, అంతమాత్రన కుట్ర చేశామని అనడం సరికాదన్నారు. కార్యకర్తలతో మాట్లాడితే జైలుకు పంపుతారా అని నిలదీశారు. అరెస్టులకు భయపడేది లేదని ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అరెస్టు అన్యాయం: మహేశ్‌రెడ్డి

అనంతరం మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఫార్మాసిటీని వ్యతిరేకిస్తున్నా పట్టించుకోక పోవడం దారుణమన్నారు. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్యాయంగా అరెస్టు చేశారని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులు ఫోన్ చేయడం సాధారణ విషయమని, అంతమాత్రన అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. మా పాలనలో ఎక్కడా ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. అమాయక రైతులను జైలుకు పంపొద్దని కోరారు.



పనులు అడ్డుకుంటూ డ్రిల్లర్ కింద పడుకున్న మహిళ

హై టెన్షన్ వివాదం

- 33 కేవీ విద్యుత్ లైన్ మార్పును అడ్డుకున్న కాలనీవాసులు
- ఆందోళనకారులను పక్కకు జరిపి, స్తంభాలు పాతించిన పోలీసులు

తుర్కయంజాల్: హై టెన్షన్ లైన్ మార్పు వివాదానికి దారితీసింది. ఈ ఘటన రాగన్నగూడలోని శ్రీగణేశ్‌నగర్‌లో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గణేశ్ శ్రీరంగాపురం కాలనీలోని ఓ వ్యక్తికి చెందిన ఖాళీ ప్లాట్ల నుంచి ఉన్న 33 కేవీ లైన్‌ను మార్చి శ్రీగణేశ్‌నగర్‌లోని రోడ్డు వెంట వేసేందుకు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించాడు. దీంతో తమ ఇళ్ల నుంచి నూతనంగా హైటెన్షన్ లైన్‌ను తీసుకువచ్చి వేయడం ఎంతవరకు సమంజసమని కాలనీవాసులు అడ్డుకున్నారు. హైటెన్షన్ లైన్‌తో తాము ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంటుందని, లైన్ షిఫ్టింగ్‌కు అనుమతులు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఈ క్రమంలో స్తంభాలను పాతే డ్రిల్లర్ టైర్ల కింద పడుకుని ఓ మహిళ నిరసన చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఆందోళనకారులను పక్కకు తప్పించి, స్తంభాలు పాతించారు.

బందోబస్తు కోసం వచ్చాం..

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. విద్యుత్, మున్సిపల్ అధికారులు లైన్ షిఫ్టింగ్‌కు అనుమతులు ఇచ్చారని, తాము కేవలం బందోబస్తు కోసం మాత్రమే వచ్చామని వివరించారు. వారం రోజుల గడువు కావాలని ఎంత కోరినా వినని పోలీసులు, స్తంభాలు నాటిన తర్వాత మాట్లుకునే అవకాశం ఇస్తామని చెప్పడం గమనార్హం.

రాష్ట్రంలో పోలీసు రాజ్యం..

కాలనీవాసి, బంజారా సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నేనావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తోందన్నారు. తమకు గడువు ఇవ్వాలని కోరినా వినకుండా పక్షపాతంగా వ్యవహరించారని ఆరోపించారు. కొంతమంది బడాబాబులను కాపాడేందుకు గిరిజనుల ఇళ్ల మీద నుంచి హైటెన్షన్ లైన్‌ను తీసుకువస్తున్నారని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, వెంటనే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు.



భారీగా మొహరించిన పోలీసులు

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి

ఇబ్రహీంపట్నం: రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను సద్వినియోగం చేసుకొని బాలికలు ఉన్నతస్థానాలకు ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి (ఎల్‌బీనగర్ కోర్టు కాంపెక్స్) పొన్న శ్రీదేవి అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య ప్రాథమిక హక్కుగా మారిందన్నారు. బాలికలు ఆత్మ విశ్వాసంతో ముందుకెళితే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. బాల్య వివాహాలు నేరమని, ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డీఈఓ సుశీందర్‌రావు మాట్లాడుతూ.. పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలల ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. అనంతరం జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది సీహెచ్ రవి మాట్లాడుతూ.. 14 సంవత్సరాల లోపు పిల్లలతో పనులు చేయించడం నేరమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ హీరియానాయక్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లావణ్య, రాధాకృష్ణ, రవీందర్, రవి, లీగల్ ఎయిడ్ క్లినిక్ న్యాయవాది మహేందర్, అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

కల్తీ ఆహార పదార్థాల నియంత్రణకు నిరంతర తనిఖీలు

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

లక్డీకాపూల్: నిరంతర తనిఖీలతో కల్తీ ఆహార పదార్థాలను నియంత్రించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నగరంలో ఆహార భద్రత మెరుగుపడటానికి తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన విధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ, అనుబంధ శాఖల అధికారులు మరింత సమర్థంగా, అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, స్ట్రీట్ వెండర్స్, ఫుట్‌పాత్‌లపై విక్రయించే తిను బండారాలలో కల్తీ లేకుండా ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయాలని సూచించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పంకజ, సీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డా.అబ్దుల్ వకీల్, ఫుడ్ సేఫ్టీ అధికారి మూర్తి రాజు తదితరులు ల్గొన్నారు.

పరిశుభ్రత పాటించని హోటళ్లను మూసేస్తాం

నగర ప్రజలకు నాణ్యత ప్రమాణాలతో కూడిన ఆహార పదార్థాలు అందించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మేయర్ లక్డీకాపూల్‌లోని మొఘల్ రెస్టారెంట్, మాసబ్ ట్యాంక్‌లోని డైన్ హిల్ హోటల్‌ను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హోటళ్ల కిచెన్‌లో పరిశుభ్రత పాటించడం లేదని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటల్ యజమానులు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. తనిఖీల్లో వండిన ఆహార పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి మళ్లీ వేడి చేసి వినియోగదారులకు అందిస్తున్నట్లు గుర్తించామన్నారు. తరచుగా తనిఖీలు కొనసాగించి, పరిశుభ్రత పాటించని హోటళ్లను మూసివేసేందుకు వెనకాడబోమని మేయర్ హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న హోటళ్లపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.



భయం గుప్పిట్లోనే

- లగచెర్ల, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల్లో తెరుచుకోని ఇళ్లు
- 16 మంది అనుమానితులకు 14 రోజుల రిమాండ్

దుద్యాల్: వికారాబాద్ జిల్లా దుద్యాల్ మండల పరిధిలోని లగచెర్ల, పులిచెర్లకుంటతండా, రోటిబండతండాల్లో భయనక పరిస్థితులే పరిస్థితులే కొనసాగుతున్నాయి. అధికారులపై దాడి ఘటన జరిగి రెండు రోజులు గడిచినా ఇక్కడ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు. సోమవారం దాడి తర్వాత ఆయా గ్రామాలకు చెందిన సుమారు 55 మందిని పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వీరందరినీ పరిగి పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించారు. వీరిలో 39 మందికి ఘటనతో ఏమాత్రం సంబంధం లేదని గుర్తించారు. మిగిలిన 16 మందిని అనుమానితులుగా నిర్ధారించి, మంగళవారం రాత్రి కొడంగల్ న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా.. 14 రోజుల రిమాండ్ విధించారు. మిగిలిన 39మందిని పోలీసులు వారివారి గ్రామాల్లో వదిలేశారు.

వివరాలు తీసుకున్నారు..

దాడిలో పాల్గొనని వ్యక్తులను కూడా పోలీసులు తీసుకెళ్లడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. గత సోమవారం రాత్రి గ్రామాలను చుట్టుముట్టిన పోలీసులు అందరూ అనుమానితులే అనే ఉద్దేశంతో కనిపించిన వారినల్లా లాక్కెళ్లారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. ఫార్మాలో తమ భూములు పోతలేవని, ధర్నాలలో పాల్గొనలేదని పోలీసులకు చెప్పామన్నారు. దీంతో పూర్తి వివరాలు తీసుకుని ఎలాంటి షరతులు లేకుండా విడిచిపెట్టారన్నారు. ఇదిలా ఉండగా కేవలం లగచెర్లకు చెందిన వారిని మాత్రమే వదిలేశారని, రోటిబండతండా, పులిచెర్ల కుంటతండా గ్రామాల గిరిజన రైతులను ఒక్కరిని కూడా విడిచిపెట్టలేదని ఆయా తండాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వీరంతా భయం నుంచి తేరుకోలేదు.

నాకొడుకు దాడిలో లేడు..


సోనీబాయి, రోటిబండ తండా

రోటిబండతండాకు చెందిన సోనీబాయికి ఏకైక కొడుకు బాస్యనాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి తీసుకెళ్లారు. సోమవారం జరిగిన ఘటనతో తన కొడుకుకు ఎలాంటి సంబంధం లేదని, ఆరోజు మేకలు తోలుకొని అడవికి వెళ్లాడని ఎంత చెప్పినా పోలీసులు పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతోంది. తనకు కళ్లు కనిపించవని, వండుకునే పరిస్థితి కూడా లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. దాడిలో పాల్గొనని తన కొడుకును విడిచిపెట్టాలని రోదించింది.

డెలివరీ సమయమని చెప్పినా వినలేదు


జ్యోతి, గర్భిణి, పులిచెర్లకుంట తండా

పులిచెర్లకుంటతండాకు చెందిన ప్రవీణ్, జ్యోతి దంపతులు. ప్రస్తుతం జ్యోతి నిండు గర్భిణి. పోలీసులు వచ్చి తన భర్తను తీసుకెళ్తుండగా.. తనకు డెలివరీ సమయం ఉందని కాళ్లు మొక్కినా పట్టించుకోలేదని వాపోయింది. తాను ఆస్పత్రికి వెళ్లాలని, రెండు రోజులుగా నిద్రాహారాలు లేవని కన్నీరు కార్చింది. ఇంట్లో ఒంటరిగా ఉండలేకపోతున్నాని వెంటనే తన భర్తను వదిలేయాలని కోరింది.

2,380 కిలోల డ్రగ్స్ ధ్వంసం

సాక్షి, సిటీబ్యూరో: రూ.7.17 కోట్ల విలువ చేసే 2,380 కిలోల వివిధ రకాల మాదక ద్రవ్యాలను సైబరాబాద్ పోలీసులు ధ్వంసం చేశారు. డ్రగ్ డిస్పోజల్ కమిటీ రంగారెడ్డి జిల్లాలోని ఏదులపల్లి గ్రామంలోని జీజే మల్టీక్లేవ్ (ఇండియా) ప్రై.లి.కు చెందిన బయో మెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో ఆయా డ్రగ్స్‌ను బుధవారం ధ్వంసం చేశారు. కమిషనరేట్ పరిధిలోని ఐదు జోన్లలో 155 ఎన్‌డీపీఎస్ కేసులలో ఆయా మాదక ద్రవ్యాలను పోలీసులు పట్టుకున్నారు. వీటిల్లో అత్యధికంగా 2,286 కిలోల గంజాయి ఉండగా.. 354 గ్రాముల గంజాయి మొక్కలు, 45.75 కిలోల గంజాయి చాక్లెట్లు, 8 లీటర్ల హాష్ ఆయిల్, 87 గ్రాముల ఎండీఎంఏ, 72 గ్రాముల కొకైన్ తదితర డ్రగ్స్ ఉన్నాయి. డీసీపీ క్రైమ్స్ కె.నర్సింహ, ఏసీపీ సైబర్ క్రైమ్స్ రవీందర్ రెడ్డి, సీసీఆర్బీ ఏసీపీ కళింగ రావు, నార్కోటిక్స్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నివాస ప్రాంతాల్లోకి కొండచిలువ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్‌లోని నివాస ప్రాంతంలోకి మంగళవారం రాత్రి ఓ కొండచిలువ చొరబడింది. స్థానిక యువకులు గమనించి రాళ్లతో కొట్టి దానిని చంపారు. తరుచూ విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి వస్తున్నాయని, తాము తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నామని స్థానికులు తెలిపారు. గత నెల రోజుల్లో మూడు విషసర్పాలు నివాస ప్రాంతాల్లోకి వచ్చాయని స్థానికులు వాపోయారు.

అమ్మవారి జాతరకు వేళాయె

- 15 నుంచి మైసిగండి మైసమ్మ వార్షికోత్సవాలు
- ఏటా కార్తీక పౌర్ణమికి జాతర ప్రారంభం
- ఆరు రోజుల పాటు కొనసాగనున్న వేడుకలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


మైసిగండి మైసమ్మ ఆలయ ప్రాంగణం

కడ్తాల్: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న మండలంలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లి వార్షికోత్సవాలు ఈ నెల 15న(శుక్రవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. జాతర 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా కొనసాగనుంది. ఏటా కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జరిగే మైసమ్మ జాతరకు జిల్లా నుంచే కాకుండా మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, వికారాబాద్, మేడ్చల్, నల్లగొండ, హైదరాబాద్, మెదక్ తదితర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై మైసిగండి ఆలయం ఉండటంతో నిత్యం అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కడతారు. ప్రత్యేకించి ఆది, మంగళ, గురువారాల్లో వేల సంఖ్యలో దర్శనానికి వస్తూ మొక్కులు చెల్లించుకుంటారు. జాతరను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా రంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ట్రస్టీ శిరోలీపంతునాయక్, ఈఓ స్నేహలత పేర్కొన్నారు.

నిర్వహించే కార్యక్రమాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15న అమ్మవారికి క్షీరాభిషేకం, విశేష అలంకరణ, కుంభహారతి, 16న విశేష పూజలు రాత్రికి పుష్పరథోత్సవం, చిన్న తేరు ఊరేగింపు ఉంటుందన్నారు. 17న విశేషపూజలు, అమ్మవారి పెద్ద రథోత్సవం, 18న అమ్మవారి బోనాలు, బండ్లు తిప్పుట, 19న శతచండీ హోమం, విశేషపూజలు, కార్తీక దీపోత్సవం, 20న అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ, అన్నదాన కార్యక్రమాలతో ఉత్సవాలు వైభవంగా ముగుస్తాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రవాణా సదుపాయం

హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే మార్గంలో మైసిగండి మైసమ్మ ఆలయం ఉంది. నగరం నుంచి 48 కిలోమీటర్ల దూరంలో మైసిగండి క్షేత్రం కొలువై


కొలువైన మైసమ్మ తల్లి

యుంది. ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అదే విధంగా నల్లగొండ ఎక్స్ రోడ్, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్, చంద్రయాన్‌గుట్ట నుంచి ప్రతి ఐదు నిమిషాలకు బస్సులున్నాయి. కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, అచ్చంపేట్ నుంచి కూడా బస్సు సౌకర్యం కలదు.

ప్రత్యేక ఏర్పాట్లు



మైసిగండి మైసమ్మ జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అదే విధంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయిస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక వసతి, సౌకర్యాలు తదితర ఏర్పాట్లు చేపట్టాం.

– శిరోలి పంతునాయక్, ఆలయ ట్రస్టీ

ఇబ్బందులు రాకుండా..



ఆలయంలో ఆరు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. పోలీసుల సహకారాన్ని తీసుకుంటున్నాం.

–స్నేహలత, ఈఓ

పెళ్లికి వెళ్లొచ్చే సరికి ఇల్లు గుల్ల

ఇంట్లో దాచిన రూ.ఆరు లక్షల నగదు చోరీ

షాద్‌నగర్‌రూరల్: పెళ్లికి వెళ్లి వచ్చే సరికి ఇంట్లో దాచి పెట్టిన నగదును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఆలస్యంగా బుధవారం వెలుగు చూసింది. పట్టణ సీఐ విజయకుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మమ్మ గ్రామంలో కిరాణా షాపు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తుంది. భర్త అంజయ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. ఆమె నలుగురు కూతుళ్లకు పెళ్లిళ్లు కావడం, భర్త మరణించడంతో గ్రామంలో ఒంటరిగా జీవిస్తుంది. రూ.ఆరు లక్షలు తన కూతురుకు ఇల్లు కట్టుకునేందుకు ఇవ్వాలని ఇంట్లో డబ్బాలో దాచి పెట్టింది. లక్ష్మమ్మ ఈ నెల 9న ఇంటికి తాళంవేసి మండల పరిధిలోని బూర్గుల గ్రామంలోని బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లింది. తిరిగి బుధవారం వచ్చి చూడగా ఇంటి వెనుక భాగంలోని తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు విరగగొట్టిరూ. 6 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఈ విషయాన్ని చుట్టు పక్కల వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీంను రప్పించి వివరాలను సేకరించారు. బాధితురాలు లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ సీఐ తెలిపారు.

'వేధింపులకే సిద్ధేశ్వరి బలి'

అత్తాపూర్: అత్తమామలు, ఆడపడుచు వేధింపులు తాళలేకే ఇంట్లో ఒంటరిగా భావించిన సిద్ధేశ్వరి(20) ఆత్మహత్య చేసుకున్నట్లు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటరామిరెడ్డి తెలిపారు. అత్తాపూర్ పాండురంగానగర్‌కు చెందిన ప్రవీణ్‌స్వామికి కామారెడ్డి జిల్లా మద్నూర్ గ్రామానికి చెందిన సిద్ధేశ్వరిని ఆరు నెలల క్రితం ఇచ్చి వివాహం చేశారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో కలిసి ఒకే ఇంట్లో కాపురం ఏర్పాటు చేసుకున్నారు. ప్రవీణ్ స్థానికంగా ఉన్న ఒక జ్యూవెలరీ షాపులో పని చేస్తుంటాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో జరిగిన శుభకార్యానికి వెళ్లగా భర్త ప్రవీణ్ దుకాణానికి వెళ్లాడు. తనను ఏ శుభకార్యానికి తీసుకెళ్లక పోవడంతోపాటు తనకు ఇంట్లో ఎలాంటి ప్రాధాన్యత కల్పించడం లేదనే మనస్తాపంతో తాను ఆత్మహత్య చేసుకుంటున్నామని సిద్ధేశ్వరి సాయంత్రం తన భర్త ప్రవీణ్‌కు ఫోన్ చేసింది. ఇరుగుపొరుగు వారు ఇచ్చిన సమాచారం మేరకు గడియ పెట్టి ఇంటిని పగులగొట్టి చూడగా సిద్ధేశ్వరి అప్పటికే మృతి చెంది ఉంది. ఈ మేరకు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరించారు.

విరాళాల లెక్క తెలపండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బుగ్గ జాతర తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మంచాల: ఉత్సవాల సందర్భంగా భక్తుల నుంచి వచ్చిన విరాళాల్లో అవకతవకలు జరిగాయని ఆరుట్ల గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు ఆరోపించారు. దీనిపై బుధవారం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతేడాది ఉత్సవాల సందర్భంగా శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి భక్తులు విరాళాలు పెద్ద ఎత్తున నగదు రూపంలో అందాయన్నారు. కొన్నేళ్లుగా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో గ్రామంలో అన్ని రాజకీయ వర్గాలను కలుపుకొని ఉత్సవాలను ఘనంగా నిర్వహించేవారన్నారు. ఈ సారి దేవాదాయ శాఖ పేరుతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు ఏక పక్షంగా ముందుకు పోతున్నారన్నారు. అన్ని వర్గాలకు సంబంధించిన ఆలయం అన్నారు. గతంలో వచ్చిన విరాళాల లెక్కలు ప్రజలకు వివరించాలన్నారు. ఉత్సవాలను కూడా రాజకీయం చేయాలనే కుట్రలను మానుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం, డీఎస్పీ నాయకులు రఘుపతి, రాములు, జానిపాషా, జంగయ్య, రాజు, యాదగిరిరెడ్డి, బుచ్చయ్య, రవి, అశోక్, శ్రావణ్‌కుమార్, వంశీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం


సమావేశంలో నినాదాలు చేస్తున్న నాయకులు

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్

బడంగ్‌పేట్: పోరాటాల ద్వారానే దళితుల సమస్యలు పరిష్కారం అవుతాయని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ ఇందిరానగర్ కాలనీలో సమావేశాన్ని బాలాపూర్ మండల దళిత సంఘం అధ్యక్షుడు రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిల్‌కుమార్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభ్యున్నతి కోసం పాటు పడటం లేదని విమర్శించారు. దళితులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉన్నారన్నారు. దళితులు ఐక్యతతోనే ముందుకు సాగి హక్కులు సాధించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి మల్లేష్, నాయకులు నారాయణ, ఆంజనేయులు, చంద్రశేఖర్‌రెడ్డి, శివనాయక్, యాదమ్మ, వీరస్వామి, రవి, చిట్టి, మహేష్, సనా పాల్గొన్నారు.

ఇరకాటంలో మహేందర్‌రెడ్డి

- సోదరుడి అరెస్టుతో అయోమయంలో పట్నం అనుచరులు
- నోరుమెదపని మండలి చీఫ్ విప్
- లగచర్ల దాడి జరిగింది మొదలు అంతా గప్‌చుప్
- అటు సొంత సోదరుడు.. ఇటు పార్టీ
- అడకత్తెరలో పోక చెక్కలా పరిస్థితి

వికారాబాద్: సీఎం సొంత నియోజకవర్గం దుద్యాల్ మండలం లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడి శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని ఇరకాటంలో పడేసింది. ఘటన జరిగింది మొదలు నోరు మెదపకుండా సైలెంట్‌గా ఉంటూ వస్తున్న ఆయనకు సొంత సోదరుడు నరేందర్‌రెడ్డి అరెస్టు వ్యవహారం మరింత అయోమయంలో పడేసింది. అధికారులపై దాడి ఘటనపై గానీ ఇటు నరేందర్‌రెడ్డి పాత్రపైగానీ మహేందర్‌రెడ్డి నోరు మెదపలేని పరిస్థితి తలెత్తింది. ఇటు సొంత పార్టీ కాంగ్రెస్.. అటు సొంత సోదరుడు నరేందర్‌రెడ్డి కావటంతో ఇప్పుడు ఎటూ తేల్చుకోలేక పోతున్నారు. లగచర్లలో కలెక్టర్ సహా అధికారులపై దాడి జరిగింది మొదలు అటు ప్రతిపక్ష పార్టీల నేతలు.. ఇటు సొంత పార్టీ నేతలు స్పందిస్తూనే ఉన్నారు. అధికార పార్టీకి చెందిన జిల్లా ఎమ్మెల్యేలు కాలె


చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

యాదయ్య, మనోహర్‌రెడ్డి కలెక్టర్‌ను కలిసి పరామర్శించారు. దాడిని ఖండించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సైతం అధికారులకు బాసటగా మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల నేతలు ఘటనపై స్పందించారు. ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. కానీ పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు మాత్రం ఇప్పటి వరకు నోరు విప్పలేదు.

అటు సోదరుడు.. ఇటు పార్టీ

రాజకీయ ఆరంగేట్రం చేసింది మొదలు పట్నం సోదరులు మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి ఒకే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ముందుగా టీడీపీలో ఆ తరువాత బీఆర్‌ఎస్‌లో అనేక పదవులు చేపట్టినప్పటికీ ఇద్దరు ఒకే పార్టీలో ఉంటూ రావటంతో ఇలాంటి ఇరకాట పరిస్థితి ఎప్పుడూ తలెత్తలేదు. తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో మరియు ముఖ్యంగా తాండూరు నియోజకవర్గంలో చోటు చేసుకున్న పరిణామాలు పట్నం సోదరులిద్దరిని విడదీశాయి. అసెంబ్లీ ఎన్నికల అనంతరం పార్లమెంట్ ఎన్నికలకు ముందు పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. అనంతరం మహేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ శాసన మండలి చీఫ్‌విప్ పదవిని కట్టబెట్టగా ప్రస్తుతం ఆయన ఆ హోదాలో కొనసాగుతున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం ప్రత్యర్థిగా కొడంగల్‌లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మరియు అతని పెద్ద సోదరుడు రాజేందర్‌రెడ్డి కుమారుడు అయిన అవినాశ్‌రెడ్డిలు బీఆర్‌ఎస్‌లోనే ఉండిపోయారు. దీంతో పట్నం కుటుంబసభ్యులు సగం కాంగ్రెస్‌లో మరో సగం బీఆర్‌ఎస్‌లో కొనసాగుతూ వస్తున్నారు. అయితే ఇన్నాళ్లు అంతా సవ్యంగానే నడిచినా లగచర్ల ఘటనతో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు పూర్తిగా ఇరకాటంలో పడిపోయారు. అటూ సోదరుడు నరేందర్‌రెడ్డి అరెస్టును ఖండించలేదు.. ఇటు పార్టీ విధానాల మేరకు అధికారులపై జరిగిన దాడిని కూడా ఖండించలేని పరిస్థితి నెలకొంది.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చేవెళ్ల: లైంగిక నేరాలకు పాల్పడే వారికి చట్టంలో కఠిన శిక్షలు ఉంటాయనే.. దానికి ఎల్బీనగర్‌లోని పోక్సో ప్రత్యేక కోర్టులో బుధవారం నిందితుడికి విధించిన 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.25వేల జరిమానా తీర్పు నిదర్శమని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. చేవెళ్లలో ఆయన ఇందుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2016లో వికారాబాద్ జిల్లా పూడూరు మండలం బాకాపూర్ గ్రామానికి చెందిన వడ్డే ప్రకాశ్ అనే యువకుడు డ్రైవర్‌గా పని చేశాడు. ఇతడు ఓ బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం, లైగింక వేధింపులకు పాల్పడినట్లుగా పోక్సో కేసు నమోదైంది. ఈ వ్యవహారంలో పోలీసులు నిందితుడిని పట్టుకొని లైంగిక నేరానికి పాల్పడినట్లుగా ఆధారాలతో కోర్టుకు అభియోగ పత్రాలు సమర్పించారు. ఈ మేరకు నిందితుడికి ఎల్బీనగర్‌లోని పోక్సో ప్రత్యేక కోర్టులో జడ్జి హరీశ కేసు పూర్వాపరాలు పరిశీలించి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు. ఇలాంటి కేసులో వేగవంతంగా, సమర్థవంతమైన న్యాయం చేసేందుకు పోలీసుశాఖ చేసిన కృషి అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

అత్తాపూర్: పని కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అత్తాపూర్ పోలీసుల సమాచారం మేరకు... కర్ణాటక బీదర్ ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్(30) తన కుటుంబంతో కలిసి బతుకుదెరువు నిమిత్తం ఏడు నెలల క్రితం హైదరాబాద్‌లోని శివరాంపల్లి ప్రాంతానికి వచ్చి ఓ అద్దె ఇంట్లో ఉంటున్నారు. మొయినాబాద్ ప్రాంతంలో ఉన్న తాజ్ హోటల్‌లో డ్రైవర్‌గా పని చేసేందుకు యాజమాన్యంతో ఒప్పంద కుదుర్చుకున్నాడు. విధి నిర్వహణలో భాగంగా అక్టోబర్ 16వ తేదీన ఉదయం 8.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లిన సంజయ్‌కుమార్ 26 రోజులు గడిచిన ఇంటికి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో ఆందోళనకు చెందిన ప్రతిభ అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి, ఏఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌అండ్‌టీ మెట్రోకు ప్రతిష్టాత్మక పురస్కారాలు

సాక్షి, సిటీబ్యూరో: బ్రాండ్‌కమ్యూనికేషన్స్ రంగంలో ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైల్‌కు పలు పురస్కారాలు లభించాయి. సంస్థ అంతర్గతంగా, వెలుపల అత్యుత్తమ కమ్యూనికేషన్ సామర్థ్యాలను ప్రదర్శించినందుకు ఈ అవార్డులు అందుకుంది. ట్రావెల్ రంగంలో ఉత్తమ కంటెంట్‌తో మార్కెటింగ్ క్యాంపెయిన్ నిర్వహించినందుకు గాను ప్రతిష్టాత్మక బ్రాండ్ స్టోరీజ్ అవార్డు లభించింది. అసాధారణ బ్రాండ్ కంటెంట్ మార్కెటింగ్ వ్యూహంతో ప్రయాణికులపై విశేషమైన ప్రభావాన్ని చూపినట్లు గుర్తించారు. ఢిల్లీలో పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీఆర్‌సీఐ) నిర్వహించిన 18వ గ్లోబల్ కమ్యూనికేషన్స్ కాంక్లేవ్‌లో ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్తమ ఇంటర్నల్ కమ్యూనికేషన్స్ క్యాంపెయిన్, ఉత్తమ సోషల్ మీడియా క్యాంపెయిన్ పురస్కారాలను కూడా అందుకున్నారు. 73 కంపెనీలు ఈ అవార్డుల కోసం పోటీపడ్డాయి. ఈ సందర్భంగా ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ ఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ ప్రతిష్టాత్మక పురస్కారాలను దక్కించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.